ఇబ్బందుల్లేకుండా ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

ముసునూరు :రబీ సీజన్‌లో పండించిన ధాన్యాన్ని రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు చేయాలని నూజివీడు సబ్ కలెక్టర్ స్మరణ్‌రాజ్ ఆదేశించారు. మండలంలోని ముసునూరు, చింతలవల్లి, చెక్కపల్లి, చలిబోయినపల్లి గ్రామాల్లో రైతు సేవా కేంద్రాలను ఆయన బుధవారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రబీ పంట కాలం సీజన్‌లో పండించిన ధాన్యాన్ని రైతులకు ఇబ్బంది లేకుండా వెంటనే కొనుగోలు చేసి కాటాలు వేయించాలన్నారు. ధరల విషయంలో కూడా ఎటువంటి మార్పులు లేకుండా రైతులకు లాభం చేకూర్చే విధంగా కొనుగోలు చేయాలని సూచించారు. అలాగే రైతులకు ధాన్యం నింపుకునేందుకు రైస్ బ్యాగులు ఎవరికి ఎన్ని కావాలో అన్ని అందించాలని మండల రెవెన్యూ అధికారులను ఆదేశించారు. మండలంలోని తాళ్లవల్లిలో రీ సర్వే పరిశీలించి, ఎలాంటి లోపాలు లేకుండా ఒక్కొక్క గ్రామంలో 60 రోజుల పాటు రీసర్వే నిర్వహించాలని, రైతుకు కనీసం సెంటు భూమి కూడా నష్టం జరగకుండా చూడాలని తెలిపారు.

ప్రభుత్వ కాలనీల్లో దాహం కేకలు..!

ఏళ్ల తరబడి సమస్యను పట్టించుకునే వారే కరువు

కిలోమీటర్ల మేర నడిచి వెళ్లి నీళ్లు తెచ్చుకోవాల్సిన దుస్థితి

వేసవిలో పరిస్థితి మరింత దారుణం

సిపిఎం ప్రజాచైతన్య యాత్ర ఫలితంగా కొన్ని కాలనీల్లో సమస్య పరిష్కారం

ప్రజాశక్తి - భీమవరం

సాధారణంగా వేసవిలో తాగునీటి ఇబ్బందులు ఏర్పడతాయి. అయితే ఆ కాలనీవాసులు మాత్రం ఏడాది పొడవునా దాహార్తితో అలమటించాల్సిందే. తాగునీటికి ప్రణాళికలు రూపొందిస్తున్నా చుక్క నీరు దొరకని దుస్థితి. కిలోమీటర్ల మేర నడిచి వెళ్లి తాగునీటిని తెచ్చుకుంటే తప్ప గొంతు తడవని పరిస్థితి. వేసవిలో అయితే పరిస్థితి మరింత దారుణం. ఏళ్ల తరబడి తాగునీటి సమస్య ఉన్నా అటువైపు కన్నెత్తి చూసేవారే కరువయ్యారు. ఫలితంగా ప్రభుత్వ కాలనీ వాసులు దాహార్తితో అలమటిస్తున్నారు.

ప్రభుత్వాలు ఆర్భాటంగా కాలనీలు ఏర్పాటు చేసి చేతులు దులుపుకుంటున్నాయి. కనీస సౌకర్యాలు కల్పించకుండా అసౌకర్యాల నిలయంగా మార్చింది. కనీసం తాగునీటి అవసరాలు తీరక కాలనీవాసులు నానావస్థలు పడుతున్నారు. తాగునీటి వసతులు కల్పించండి మహాప్రభో అంటూ ప్రజాప్రతినిధులు, అధికారులను వేడుకున్నా కనీసం స్పందించిన దాఖలాల్లేవు. ఏళ్ల తరబడి సమస్య అలానే ఉండటంతో కాలనీవాసులు గొంతు తడుపుకునేందుకు నీళ్ల కొనుగోలు లేక సుదూర ప్రాంతాలకు వెళ్లి నీరు తెచ్చుకోవడం వంటివి చేస్తున్నారు. ప్రతియేటా తాగునీటి పథకాలకు రూ.కోట్లు ఖర్చు చేస్తున్నప్పటికీ అవేమీ ప్రభుత్వ కాలనీల్లో సమస్యను పరిష్కరించని పరిస్థితి. ఇక ఊరికి దూరంగా కాలనీలు ఏర్పాటు చేయడంతో ఆ ప్రాంతానికి పైపులైన్ వేసేందుకు రూ.కోట్లలో ఖర్చవుతుందని అధికారులు సాకులు చెబుతున్నారు. ఆయా కాలనీ ప్రజలు గట్టిగా నిలదీస్తే తాత్కాలిక ఉపశమన చర్యలు చేపట్టి ఆ తర్వాత చేతులెత్తేస్తున్నారు. కొన్నిచోట్ల కలుషిత నీరు వస్తుండటంతో పరిస్థితి మరింత దారుణంగా తయారవుతోంది. ఓపక్క డ్రెయినేజీలు లేక దోమలు విజృంభించి రోగాల బారిన పడుతుంటే కలుషిత నీటితో పరిస్థితి మరింత దయనీయంగా తయారవుతోంది. దీంతో వేలాది రూపాయలు చికిత్స నిమిత్తం ఖర్చు చేయాల్సి వస్తోంది. ఒక సామాన్య, మధ్యతరగతి కుటుంబం నీటి కొనుగోలు నిమిత్తం రోజుకు రూ.20 నుంచి రూ.40 వరకు ఖర్చు చేస్తున్నారు. నెలకు రూ.600 నుంచి రూ.1000 వరకు ఖర్చు చేస్తున్న పరిస్థితి దాపురించింది. ఇదిలా ఉంటే చేపలు, రొయ్యల చెరువుల నీటిని కాల్వల్లోకి వదిలేస్తున్నారు. ఆ కాల్వల్లో నీటినే తాగునీటి చెరువుల్లోకి నింపుతున్నారు. పసర్లు కమ్మిన నీటిని తాగలేక జనం నీటిని కొనుగోలు చేసుకోవాల్సి రావడం అనివార్యంగా మారింది. 2014 ఎన్నికల్లో తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని, ప్రతి కుటుంబానికి 20 లీటర్ల నీటిని ఉచితంగా ఇస్తామని టిడిపి చెప్పింది. గెలిచిన తర్వాత పట్టించుకున్న పరిస్థితి లేదు. 2019 ఎన్నికల ముందు జిల్లాలో సాగిన పాదయాత్రలో వైసిపి అధినేత జగన్ తమ పార్టీ అధికారంలోకి రాగానే గోదావరి నుంచి పైపులైన్ ద్వారా తాగునీటిని అందిస్తామని చెప్పి వాటర్ గ్రిడ్ పథకాన్ని తెరపైకి తీసుకొచ్చారు. దీనికోసం వైసిపి ప్రభుత్వం రూ.3670 కోట్లతో ప్రతిపాదనలు కూడా సిద్ధం చేసింది. అయితే ఈ పనులు ఒక అడుగూ ముందుకు పడలేదు. అయితే జలజీవన్ మిషన్ పథకంలో నిధులు మంజూరైనప్పటికీ పనులు మాత్రం పూర్తిస్థాయిలో చేపట్టలేదు.



మోగల్లు ప్రభుత్వకాలనీలో ప్రారంభానికి నోచుకోని వాటర్ ట్యాంకు

దాహార్తితో కాలనీవాసులు విలవిల

సీతారామపురం నార్త్ ప్రాంతంలో తాగునీటి కొరత తీవ్రంగా ఉంది. ఇక్కడ తాగునీరు సరఫరా కావడం లేదు. కుళాయి కనెక్షన్ అడిగినా పట్టించుకునే వారు లేరు. దీంతో రెండు కిలోమీటర్ల మేర నడిచి వెళ్లి నీటిని తెచ్చుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. నరసాపురం ప్రభుత్వ కాలనీకి కనీసం పైపులైన్ కూడా ఏర్పాటు చేయలేదు. ఇక్కడ నివాసం ఉంటున్న వారంతా తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. చించినాడ ప్రభుత్వ కాలనీవాసులకు కుళాయి కనెక్షన్లు ఇవ్వట్లేదు. తాగేందుకు నీరు లేక సుదూర ప్రాంతం వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. పోడూరు వైఎస్ఆర్ కాలనీకి పైప్‌లైన్ ఏర్పాటు చేసినా వాటి ద్వారా తాగునీటి సరఫరా లేదు. దీంతో చేసేదేమీ లేక వేరే ప్రాంతానికి నడిచి వెళ్లి నీటిని తెచ్చుకుంటున్నారు. మినిమించిలిపాడు కాలనీకి పైపులైన్ ఏర్పాటు చేయలేదు. పెనుగొండ వైఎస్ఆర్ కాలనీకి అసలు తాగునీటి సౌకర్యమే లేదు. తాడేపల్లిగూడెం మండలం ఆరుగొలను కాలనీలో అన్ని ఉన్నప్పటికీ తాగునీటిని సరిపడా సరఫరా చేయకపోవడం గమనార్హం. గణపవరం మండలం కోమట్లపాలెంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. విస్సాకోడేరు ప్రభుత్వ లేఅవుట్ సమీపాన 60 ఎకరాల్లో తాగునీటి చెరువు ఉన్నప్పటికీ ఈ కాలనీకి తాగునీటిని అందించట్లేదు. మోగల్లు ప్రభుత్వ కొత్త కాలనీకి తాగునీటి సదుపాయం లేక అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ వాటర్ ట్యాంక్ నూతనంగా నిర్మించినప్పటికీ ప్రారంభానికి నోచుకోలేదు. ఉండి ప్రభుత్వ కాలనీకి తాగునీరు అందించట్లేదు. కాళ్ల ప్రభుత్వ కాలనీలో మంచినీటి సౌకర్యం ఉన్నా పూర్తిస్థాయిలో నీటిని సరఫరా చేయట్లేదు. కాళ్లకూరు వెంకటాపురం కాలనీకి తాగునీటి సౌకర్యం లేకపోవడంతో దూరప్రాంతం వెళ్లి నీటిని తెచ్చుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. పైపులైన్ కనెక్షన్ ఇవ్వాలని అధికారులను కోరుతున్నా రూ.10 వేలు కట్టాలని చెబుతున్న పరిస్థితి ఉంది. ఆకివీడు తాళ్లకోడు కాలనీలో అనేక కుటుంబాలు నివాసముంటున్నా ఈ ప్రాంతానికి సైతం తాగునీటిని అందించే పరిస్థితి లేదు.

ప్రభుత్వ కాలనీవాసుల్లో భరోసా నింపిన సిపిఎం యాత్ర..

జిల్లావ్యాప్తంగా ఇటీవల సిపిఎం ప్రజా చైతన్య సైకిల్ యాత్ర చేపట్టి ప్రజా సమస్యలపై అధ్యయనం చేసింది. ఈ సైకిల్ యాత్ర బృందం ఎదుట ప్రభుత్వ కాలనీల ప్రజలు అనేక సమస్యలు ప్రస్తావించి కంటతడి పెట్టారు. దీనిలో ప్రధానంగా తాగునీటి సమస్యపై జిల్లావ్యాప్తంగా ప్రజానీకం ఏకరువు పెట్టారు. తాగేందుకు గుక్కెడు నీళ్లు కూడా లేవు అని తామంతా ఎలా బతికేది అంటూ కన్నీరుమున్నీరుగా బృందం వద్ద వాపోయారు. ఈ నేపథ్యంలో సిపిఎం స్థానికంగా ఉన్న సమస్యలతోపాటు ప్రధానంగా తాగునీటి సమస్యను జిల్లా అధికార యంత్రాంగం దృష్టికి తీసుకెళ్లి కొన్ని ప్రాంతాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేసింది. దీంతో ఆయా కాలనీవాసుల్లో భరోసా నిండింది.

ఇసుక లభ్యతకు పటిష్ట ప్రణాళిక రూపొందించాలి

జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ ధాత్రిరెడ్డి

మాట్లాడుతున్న ధాత్రిరెడ్డి

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లా అవసరాలకు అనుగుణంగా ఇసుక స్టాక్ పాయింట్ల వద్ద ఇసుక లభ్యత ఉండేలా పటిష్టమైన ప్రణాళికను రూపొందించాలని జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి గనుల శాఖ అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్లోని గౌతమీ సమావేశం హాల్లో బుధవారం జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశం ఇన్‌ఛార్జి కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ధాత్రిరెడ్డి మాట్లాడుతూ జిల్లాలో ఉచిత ఇసుక విధానం ద్వారా ప్రజల అవసరాలకు, వివిధ ప్రభుత్వ శాఖల ద్వారా చేపడుతున్న అభివృద్ధి, నిర్మాణ పనులను అవసరమైన ఇసుకను అందుబాటులో ఉంచే విధంగా ఇసుక స్టాక్ పాయింట్ల వద్ద నిల్వ ఉంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. డీస్లిటేషన్ పాయింట్, స్టాక్ పాయింట్ల నుంచి వినియోగదారుల వద్దకు చేర్చేందుకు రవాణా ఛార్జీలు ఖరారు చేయాలని రవాణా శాఖాధికారులను ఆదేశించారు. డీస్లిటేషన్ పాయింట్, స్టాక్ పాయింట్ల వద్ద సిసి కెమెరాలతో పటిష్టమైన నిఘా పెట్టి ఇసుక అక్రమ రవాణా జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. స్టాక్ పాయింట్ నుంచి వినియోగదారులకు సరఫరాకు వినియోగించే వాహనాలకు తప్పనిసరిగా జిపిఎస్ విధానం ఉండాలని, వాహనాల కదలికలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ఉండాలని తెలిపారు. వేసవి దృష్ట్యా గోదావరి నదిలో నీటి ప్రవాహం తక్కువగా ఉందని, ఇసుక లభ్యత ఎక్కువగా ఉంటుందని, జిల్లాలో రాబోయే వర్షాకాలం సీజన్లో ఇసుక అవసరాలను దృష్టిలో ఉంచుకుని అందుకు అనుగుణంగా స్టాక్ పాయింట్ల వద్ద ఇసుకను నిల్వ చేయాలన్నారు. సమావేశంలో అదనపు ఎస్‌పి నక్కా సూర్యచంద్రరావు, ఉప రవాణా కమిషనర్ షేక్ కరీం, ఆర్‌టిఒలు కృష్ణారావు, మదానీ, గనుల శాఖ డిప్యూటీ డైరెక్టర్ బి.రవికుమార్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ త్రినాధ్‌బాబు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల బకాయిలు చెల్లించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి ఆర్.లింగరాజు

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

మండలంలో ఉపాధి కూలీలకు రెండు నెలలకు పైగా ఇవ్వాల్సిన వేతనాలను తక్షణం విడుదల చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్.లింగరాజు డిమాండ్ చేశారు. బుధవారం పంగిడిగూడెంలోని ఉపాధి కూలీల దగ్గరకు వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గతంలో అమలు జరిగిన ఐదు కిలోమీటర్లు దాటితే ఛార్జీలు ఇవ్వడం, పార, పలుగు, తట్టా తాగునీరు, టెంట్ తదితర సౌకర్యాలు అన్నింటినీ మోడీ ప్రభుత్వం కోత పెట్టిందని విమర్శించారు. ఉపాధి కూలీలకు కేటాయించాల్సిన డబ్బులను తగ్గించి సీసీ రోడ్లకు, భవనాలకు పక్కదారి పట్టించి ఉపాధి కూలీల పొట్ట కొడుతున్నారని విమర్శించారు. కూలీలందరూ ఐక్యంగా ఈ చట్టాన్ని బలోపేతం చేసుకోవడానికి పోరాడాలని, దానికి సిపిఎం అండగా ఉంటుందని తెలిపారు. తక్షణం బకాయిలు విడుదల చేయకుంటే కూలీలను సమీకరించి పోరాడతామని అన్నారు. ప్రజా ప్రతినిధులు కూలీల బకాయిల విడుదలకు కృషి చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం మండల ఆర్గనైజర్ కట్టా భాస్కరరావు గ్రామ నాయకులు మానుకొండ వీర్రాజు, తదితరులు పాల్గొన్నారు.

కూలీలతో మాట్లాడుతున్న లింగరాజు

తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రణాళిక : జెడ్‌పి ఛైర్‌పర్సన్

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాల్లో తాగునీటి సమస్య తలెత్తే ప్రాంతాలను గుర్తించి తక్షణం సమస్య పరిష్కారానికి ప్రణాళిక రూపొందించాలని ఇరిగేషన్ అధికారులను ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ఆదేశించారు. జిల్లా పరిషత్ క్యాంపు కార్యాలయంలో బుధవారం ఇరిగేషన్ అధికారులతో ఆమె సమీక్షించారు. పద్మశ్రీ మాట్లాడుతూ తాగునీటి సమస్య తలెత్తే ప్రాంతాలను గుర్తించి, సమస్య పరిష్కారానికి కార్యాచరణ ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. ప్రధానంగా పోలవరం ప్రాజెక్టు పునరావస కాలనీలు, అలాగే జిల్లాలోని వర్ష భావ ప్రాంతాలు వేసవికాలంలో తీవ్ర నీటి కొరతకు గురవుతున్న ప్రాంతాలుగా గుర్తించబడ్డాయని తెలిపారు. వీటికి తక్షణం కొత్త బోర్లు తవ్వించాల్సిన అవసరం ఉందని ఎస్ఇ ఆర్డబ్ల్యుఎస్ అధికారులను ఛైర్ పర్సన్ ఆదేశించారు. అలాగే చెట్టున్నపాడు, ఆగడాలలంక, మల్లవరం గ్రామాల్లో తాగునీటి సమస్యను పరిష్కరించామని తెలిపారు.

మాట్లాడుతున్న జెడ్‌పి ఛైర్‌పర్సన్

జూలై 31 వరకూ ఉచిత గ్యాస్ సిలిండర్ బుకింగ్

ఇన్‌ఛార్జి కలెక్టర్ ధాత్రిరెడ్డి

ప్రజాశక్తి - ఏలూరు

దీపం-2 కింద ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి జులై 31వ తేదీ వరకు ఉచిత రెండో సిలిండర్‌ను బుక్ చేసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి తెలిపారు. ప్రస్తుతం నాలుగు నెలలకు ఒకటి చొప్పున ఏడాదికి మూడు ఉచిత సిలిండర్లను ఇస్తున్నట్లు తెలిపారు. మొదటి విడత 2024 నవంబర్‌లో మొదలై ఈ ఏడాది మార్చి 31తో ముగిసిందన్నారు. ప్రస్తుతం రెండో విడత ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి మొదలైందని, ప్రతి నాలుగు నెలలకు ఒక సిలిండర్ చొప్పున ఉచితంగా ఇవ్వనున్నట్లు తెలిపారు. దీపం-2 పథకం కింద రెండో విడతలో గ్యాస్ సిలిండర్ బుక్ చేసుకుంటే రెండు రోజుల్లో సిలిండర్ ఇంటికి డెలివరీ చేస్తారన్నారు. మొదట లబ్ధిదారులు డబ్బులు చెల్లిస్తే ఆ తర్వాత 48 గంటల్లో ఆ డబ్బును ప్రభుత్వం లబ్ధిదారుల బ్యాంక్ అకౌంట్‌లోకి జమ చేస్తుందన్నారు. ఒకవేళ ఏవైనా సమస్యలు వస్తే, పౌరసరఫరాల శాఖ, గ్యాస్ ఏజెన్సీలు వెంటనే పరిష్కరిస్తాయన్నారు. ఒకవేళ గ్యాస్ రాయితీ డబ్బులు జమ కాకపోతే, వినియోగదారులు ఫిర్యాదు చేయడానికి ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. దీనికి సంబంధించి ఏమైనా అనుమానాలుంటే 1967 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చన్నారు. ఇంకా ఎవరైనా లబ్ధిదారులు సంబంధిత గ్యాస్ ఏజెన్సీలో ఇకెవైసి చేసుకోకపోయినా, బ్యాంకు అకౌంట్‌కు ఆధార్ అనుసంధానం కాకపోయినా, ఆధార్ అప్ డేట్ చేయించుకోకపోయినా వెంటనే చేసుకోవాలని తెలిపారు.

రహదారుల అభివృద్ధికి కేంద్రం నుంచి నిధులు రాబడతా

ఎంపీ పుట్టా మహేష్ కుమార్ వెల్లడి

ప్రజాశక్తి - దెందులూరు

ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని రహదారుల అభివృద్ధికి అవసరమైన నిధులు కేంద్రం నుంచి రాబడతానని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ స్పష్టం చేశారు. మండలంలోని సోమవరప్పాడులో రూ.74 లక్షలతో నిర్మించిన బిటి రోడ్డు, సిమెంటు రోడ్డును, ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్‌తో కలిసి ఎంపీ పుట్టా మహేష్ కుమార్ బుధవారం ప్రారంభించారు. తొలుత సోమవరప్పాడు ప్రధాన కూడలి వద్ద మాజీ సిఎం, కీర్తిశేషులు నందమూరి తారకరామారావు విగ్రహానికి ఎంపీ మహేష్ కుమార్, ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఎంపీ పుట్టా మహేష్ కుమార్‌కు, ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్‌కు సోమవారప్పాడు ప్రజలు ఘన స్వాగతం పలికారు. అనంతరం పెదవేగి మండలం గోపన్నపాలెం నుంచి రామసింగవరం వరకు రూ.మూడు కోట్లతో నిర్మిస్తున్న రహదారి అభివృద్ధి పనులకు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్‌తో కలిసి ఎంపీ పుట్టా మహేష్ కుమార్ శంకుస్థాపన శిలాఫలకం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ మహేష్‌కుమార్ మీడియా సమావేశంలో మాట్లాడుతూ దెందులూరు నియోజకవర్గ పరిధిలోని సమస్యలను తాను, ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. గత వైసిపి ప్రభుత్వం రహదారుల అభివృద్ధిని విస్మరించడంతో ఐదేళ్లపాటు ప్రజలు నరకం చవి చూశారని ఎంపీ తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రహదారుల అభివృద్ధిపై దృష్టి పెట్టిందని, ఫలితంగానే పల్లెల నుంచి పట్టణాల వరకు రహదారులు నూతన శోభను సంతరించుకుంటున్నాయని ఎంపీ వెల్లడించారు. మిగిలిన రహదారులను కూడా రానున్న రోజుల్లో అభివృద్ధి చేస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు. ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ సోమవరప్పాడు రహదారిని రూ.74 లక్షలతో అభివృద్ధి చేసినట్లు తెలిపారు. గోపన్నపాలెం నుంచి రామసింగవరం వరకు రూ.మూడు కోట్లతో అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ఎంపీ మహేష్‌కుమార్ సహకారంతో దెందులూరు నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి తనవంతు కృషి చేస్తున్నట్లు ఎంఎల్ఎ ప్రభాకర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ గారపాటి రామసీత, నాయకులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

భీమడోలు ఎఎంసి ఛైర్మన్‌గా శేషగిరి

ప్రజాశక్తి - ఉంగుటూరు (భీమడోలు)

భీమడోలు వ్యవసాయ మార్కెట్ యార్డ్ కమిటీ ఛైర్మన్‌గా శేషపు శేషగిరి నియమితులయ్యారు. ప్రభుత్వం బుధవారం ప్రకటించిన ఎఎంసి ఛైర్మన్ల నామినేటెడ్ పదవుల జాబితాలో శేషగిరిని ఎంపిక చేశారు. బిసి జనరల్ కోటా కింద ఆయనను ఈ పదవి వరించింది. టిడిపికి చెందిన శేషగిరి భీమడోలు ఎంపిటిసి సభ్యునిగా గతంలో పనిచేశారు. పార్టీలో నమ్మకస్తుడైన శేషగిరికి ఛైర్మన్ పదవి వరించడం పట్ల టిడిపి నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

నేడు స్థాయీ సంఘ, జెడ్‌పి సర్వసభ్య సమావేశాలు

ప్రజాశక్తి - ఏలూరు

ఈ నెల 17వ తేదీ గురువారం ఉదయం పది గంటల నుంచి ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ప్రజా పరిషత్ 1 నుంచి ఏడు వరకు గల స్థాయీ సంఘ సమావేశాలు, మధ్యాహ్నం రెండు గంటల నుంచి ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశాలు నిర్వహించనున్నట్లు ఏలూరు జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయం వారు బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జెడ్‌పి ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అధ్యక్షతన ఈ సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

రోడ్డు మార్జిన్‌లోకి దూసుకెళ్లిన స్కూల్ బస్సు

తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి - టి.నరసాపురం

మండలంలోని రాజు పోతేపల్లి అడ్డరోడ్డు సమీపంలో ప్రయివేట్ స్కూల్ బస్సు అదుపు తప్పి రోడ్డు మార్జిన్‌లోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో విద్యార్థులకు ప్రమాదం తప్పింది. ఈ సంఘటన బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... కామవరపుకోటలో ఉన్న విశ్వతేజ ఇంగ్లీష్ మీడియం ప్రయివేట్ పాఠశాలకుకు చెందిన స్కూల్ బస్సు బుధవారం మధ్యాహ్నం పాఠశాల ముగిసిన అనంతరం మండలంలోని తెడ్లం, రాజుపోతేపల్లి విద్యార్థులను తీసుకుని తెడ్లంలో కొందరు విద్యార్థులను దింపి తిరిగి రాజుపోతేపల్లి వెళ్తుండగా రాజుపోతేపల్లి అడ్డరోడ్డు సమీపంలోని మలుపులోకి వచ్చేసరికి బస్సు స్టీరింగ్ పట్టేయడంతో రోడ్డు మార్జిన్‌లో నుంచి మడిలోకి దూసుకెళ్లింది. డ్రైవర్ అప్రమత్తంగా వ్యవహరించడంతో ప్రమాదం తప్పింది. ఈ ప్రమాద సమయంలో మండలంలోని రాజుపోతేపల్లికి చెందిన 20 మంది విద్యార్థులను స్థానికులు వెంటనే బయటకు దించడంతో చిన్న చిన్న గాయాలతో బయటపడ్డారు. విద్యార్థులకు ప్రమాదం తప్పడంతో తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు. అయితే బస్సు కేవలం మార్జిన్‌లోకి దూసుకెళ్లి ఆగడంతో ప్రమాదం తప్పిందని, బోల్తా పడి ఉంటే ప్రాణనష్టం జరిగి ఉండేదని స్థానికులు చెబుతున్నారు. కాగా బస్సు ప్రమాదం డ్రైవర్ తప్పిదమా స్టీరింగ్ పట్టేయడం వల్లే జరిగిందా అంటూ పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. స్టీరింగ్ పట్టేయడం వల్లే జరిగితే పాఠశాల యాజమాన్యం ఎందుకు బస్సు ఫిట్‌నెస్ పట్టించుకోవడం లేదని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పొట్టకూటి కోసం వెళ్తే..!

ఉపాధి కూలీలపైకి దూసుకెళ్లిన వ్యాను - ముగ్గురు కూలీలు దుర్మరణం

మరొకరి తీవ్ర గాయాలు

సంఘటనా స్థలాన్ని పరిశీలించి, బాధిత కుటుంబాలను పరామర్శించిన కలెక్టర్, ఎంఎల్ఎ , ప్రముఖులు

మృతుల కుటుంబాలకు రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని వ్యకాస ఆందోళన

ప్రజాశక్తి - మొగల్తూరు, నరసాపురం

వారంతా రెక్కాడితే గాని డొక్కాడని కుటుంబాలకు చెందిన కూలీలు. వ్యవసాయ పనులు తగ్గడం, ప్రత్యామ్నాయంగా మరే పనులూ దొరక్కపోవడంతో తక్కువ కూలీ వచ్చినా ఉపాధి హామీ పనులే శరణ్యంగా పనిచేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నారు. ఓ పక్క వృద్ధాప్యం తరుముకొస్తున్నా పొట్ట నింపుకోవడం కోసం కుటుంబ యావత్తూ ఉపాధి హామీ పనులపైనే ఆధారపడుతున్నారు. ఎప్పటిలానే బుధవారం ఉదయమే ఉపాధి పని ప్రదేశానికి చేరుకున్నారు. పనులు ప్రారంభించడానికి సిద్ధమవుతున్న తరుణంలోనే వ్యాన్ రూపంలో మృత్యు శకటం వారిపైకి దూసుకొచ్చింది. అత్యంత విషాదకరమైన ఈ ఘటన మొగల్తూరులోని నల్లంవారితోటలో జాతీయ రహదారిని ఆనుకుని జరిగింది. ఈ ప్రమాదంలో ఇద్దరు మహిళలు మృత్యువాత పడగా మరో ఇద్దరు తీవ్ర గాయాలపాలయ్యారు. మృతులు, క్షతగాత్రులు సమీప బంధువులే కావడంతో వీరి నివాసప్రాంతమైన నక్కావారిపాలెం ప్రాంతంలో తీవ్ర విషాదఛాయలు అలముకున్నాయి.

ఎస్ఐ జి.వాసు తెలిపిన వివరాల ప్రకారం. మొగల్తూరు పంచాయతీ సుబ్రహ్మణ్యేశ్వరం (నక్కావారిపాలెం) చెందిన ఉపాధి కూలీలు నల్లంవారితోట, పెద్దపల్లవపాలెం గ్రామాల మధ్య ఉన్న పంట బోదెలో పూడిక తొలగించేందుకు బుధవారం ఉదయం కొలతల కొలుస్తుండగా గుంటూరు జిల్లా నరసరావుపేట నుంచి మొగల్తూరు వంట నూనె లోడుతో వస్తున్న వ్యాను అదుపుతప్పి కూలీలపైకి దూసుకెళ్లింది. ఈ సంఘటనలో గుబ్బల గంగాదేవి (55), కడలి పావని (45) అక్కడికక్కడే మృతి చెందారు. గంగాదేవి భర్త మాణిక్యాలరావు, గుడాల సత్యనారాయణ తీవ్ర గాయాలపాలయ్యారు.మృతురాలు కడలి పావనికి పెళ్లీడుకొచ్చిన ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వెంటనే స్థానికులు, పోలీసులు రంగంలోకి దిగి గాయాలపాలైన వారిని నరసాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వీరిలో పరిస్థితి విషమంగా ఉన్న గుబ్బల మాణిక్యాలరావును, గుడాల సత్యనారాయణను భీమవరంలోని ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించి మాణిక్యాలరావు (60) మృతి చెందారు. మృతదేహాలను నరసాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సంఘటనా స్థలాన్ని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్, బాధితులను పరామర్శించిన రాష్ట్ర కాపు కార్పొరేషన్ ఛైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు, డిఎస్‌పి జి.శ్రీవేద ట్రెయినీ డిఎస్‌పి మానస, డ్వామా పీడీ కెసిహెచ్ అప్పారావు, ఆర్‌డిఒ దాసిరాజు, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరు రామరాజు తదితరులు పరిశీలించారు. అనంతరం నరసాపురం ఆసుపత్రిలో మృతుల కుటుంబాలను కలెక్టర్, ఎంఎల్ఎ, తదితరులు పరామర్శించారు. ఈ ప్రమాదంపై మొగల్తూరు ఎస్ఐ వాసు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గంగాదేవి మృత దేహం వద్ద రోదిస్తున్న బంధువులు

మొగల్తూరులో ఉపాధి హామీ పనిచేస్తూ ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, గాయపడిన కుటుంబానికి రూ.5 లక్షలు ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బాతిరెడ్డి జార్జి, జక్కంశెట్టి సత్యనారాయణ, జిల్లా ఉపాధ్యక్షులు కౌరు పెద్దిరాజు డిమాండ్ చేశారు. నరసాపురం ప్రభుత్వాసుపత్రి వద్ద వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో గ్రామస్తులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జార్జి, పెద్దిరాజు, సత్యనారాయణ మాట్లాడుతూ ఉపాధి హామీలో మృతి చెందిన కుటుంబాలకు ఎంఎల్ఎ, జిల్లా కలెక్టర్ మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున, గాయపడిన కుటుంబానికి రూ.5 లక్షల చొప్పున ఇవ్వాలని డిమాండ్ చేశారు.ఈ దుర్ఘటన చాలా బాధాకరమని కాపు కార్పొరేషన్ ఛైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు అన్నారు. ప్రభుత్వాసుపత్రికి వెళ్లి మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం మృతుల కుటుంబాలకు రూ.10 వేలలు చొప్పున, గాయపడిన వారికి రూ.5 వేలు ఆర్థిక సహాయం అందించారు.

సంఘటనలో తీవ్రంగా గాయపడిన గుబ్బల మాణిక్యాలరావుకు చికిత్స నిమిత్తం విప్ బొమ్మిడి నాయకర్ రూ.50,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. మాణిక్యాలరావును భీమవరం ఆస్పత్రి నుండి గుంటూరు తరలించేందుకు అత్యవసర వాహనానికి ఆయన వైద్య ఖర్చు నిమిత్తం ఈ నిధులను అందించారు. ప్రభుత్వపరంగా మెరుగైన వైద్యం అందించేందుకు చర్యలు చేపడతామన్నారు.

ఈదురుగాలులకు నేలకొరిగిన మొక్కజొన్న

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

మండలం పరి ధిలో అకాల వర్షం, ఈదురు గాలికి మొక్కజొన్న పంట నేలకొరిగింది. పూత దశ నుంచి గట్టిపడే దశలో ఉన్న మొక్కజొన్న పంట ఈదురుగాలులకు నేల కొరిగింది. ప్రాథమిక నష్టం అంచనా ప్రకారం సుమారు 18 ఎకరాల వరకు ఉన్నట్లు ఆయా రైతు సేవా కేంద్రాల వ్యవసాయ సహాయకులు తెలిపారు. ఇతర పంటలకు ఏమన్నా నష్టం జరిగి ఉంటే రైతులు తప్పనిసరిగా ఆయా రైతు సేవా కేంద్రాల సహాయకులకు వెంటనే తెలియజేయాలని మండల వ్యవసాయాధికారి డి.ముత్యాలరావు తెలిపారు. ఇటీవల అకాల వర్షాలు వస్తున్నందున రైతులు కోత కోసిన మొక్కజొన్న కండెలు, వేరుశెనగ వంటి పంటలను సురక్షితమైన ప్రదేశాల్లో నిల్వ ఉంచుకోవడం, వర్షాల వల్ల పంట తడవకుండా బరకాలు కప్పుకోవడం వంటి జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ప్రస్తుతం నేలకొరిగిన మొక్కజొన్న పంట ప్రాథమిక అంచనాలు ఉన్నతాధికారులకు తెలియజేశామని, తర్వాత ఆదేశాలు వచ్చిన వెంటనే నష్టం అంచనాలు గ్రామాల వారీగా తయారుచేసి నష్టపరిహారం కోసం అధికారులకు నివేదిక పంపిస్తామని వ్యవసాయాధికారి తెలిపారు.

నేలకొరిగిన మొక్కజొన్న

పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి

ప్రజాశక్తి - ముసునూరు

అంగన్వాడీలో చదివిన ప్రతిఒక్కరూ ప్రభుత్వ పాఠశాలలోనే చేరే విధంగా చర్యలు తీసుకోవాలని అంగన్వాడీ సిబ్బందితో మండల విద్యాశాఖాధికారి బివిఎస్. సుబ్బారావు అన్నా రు. మండలంలోని 59 అంగన్వాడీల కేంద్రం టీచర్స్‌తో మండల విద్యా శాఖాధికారి కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఎన్‌రోల్‌మెంట్ పెరిగేందుకు అంగన్వాడీ కేంద్రంలో ఐదేళ్లు నిండిన పిల్లలను సమీప మండల పరిషత్ ఉన్నత పాఠశాలలో చేర్పించాలని అంగన్వాడీ ఉపాధ్యాయులతో మాట్లాడారు. మండలంలో ఐదేళ్లునిండిన బాల, బాలికలను పాఠశాలలో కచ్చితంగా చేర్చుకోవాలన్నారు. దీని కోసం మండలంలో ఉన్న అన్ని ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అంగన్వాడీ టీచర్లందరూ కూడా ప్రతి ఇంటికి తిరిగి తల్లిదండ్రులకు తెలియజేసి వారి పిల్లలను మండల పరిషత్ స్కూల్లో చేర్చి విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి, ఎంఇఒ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంఇఒ సుబ్బారావు

అనారోగ్యంతో సీతారామరాజు మృతి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ఆంధ్రజ్యోతి దినపత్రిక బ్యూరో ఇన్‌ఛార్జ్ జివిఎస్ఎన్.రాజు తండ్రి గొట్టుముక్కల సీతారామరాజు మంగళవారం మృతి చెందారు. అనారోగ్య కారణాలతో ఆశ్రం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆయన తుదిశ్వాస విడిచారు. ఆయన మృతదేహాన్ని శనివారపు పేటలోని స్వగృహానికి తరలించారు. ఈ విషయం తెలుసుకున్న ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి, విజయవాడ ఎపిఎస్ ఆర్‌టిసి రీజనల్ ఛైర్మన్ రెడ్డి అప్పలనాయుడు, రైతు సంఘం నేత శ్రీనివాస్, సిఐటియు నాయకులు ప్రసాద్, రవి అక్కడకు చేరుకుని సీతారామరాజు మృతదేహంపై పుష్పగుచ్ఛం ఉంచి శ్రద్ధాంజలి ఘటించారు. జివిఎస్ఎన్.రాజు, ఇతర కుటుంబ సభ్యులను పరామర్శించి, ధైర్యంగా ఉండాలని సూచించారు. పలువురు పాత్రికేయులు కూడా మృతదేహాన్ని సందర్శించి సీతారామరాజుకు ఘన నివాళులర్పించారు.



మాట్లాడుతున్న ప్రధానోపాధ్యాయురాలు రాధికారాణి

విద్యార్థులచే జల ప్రతిజ్ఞ

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

మండలంలోని గొల్లపల్లిలోని శ్రీ అన్నే రామకృష్ణయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జల ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి.రాధికారాణి మాట్లాడుతూ విద్యార్థులందరూ నీటిని వృథా చేయకూడదని, నీటిని పొదుపుగా వాడాలని, నీటిని కలుషితం చేయకూడదని, చెరువులు, నదులు, సరస్సులు ఆక్రమించకూడదని, నీటిని దుర్వినియోగం చేయకూడదని తెలిపారు. నీటిని శుభ్రంగా, సరక్షితంగా ఉంచడానికి ప్రయత్నించాలని, కుటుంబ సభ్యులు, స్నేహితులు నీటిని సంరక్షణలో భాగస్వాములు చేయాలని తెలిపారు. భవిష్యత్ తరాలకు భూ గర్భ జలాలు ఇంకిపోకుండా నీటిని సంరక్షించుకోవాలని తెలిపారు. విద్యార్థులచే జల ప్రతిజ్ఞ చేయించారు. వక్తృత్వ పోటీలు నిర్వహించి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జల్లులక్ష్మి, విఠల్‌బాబు, రవీంద్ర, నాన్‌టీచింగ్ సిబ్బంది నారాయణ పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

ఆటోనగర్‌లో చెలరేగిన మంటలు

అదుపుచేసిన అగ్నిమాపక సిబ్బంది

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

పట్టణంలోని ఆటోనగర్ ప్రాంతంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. స్థానికుల సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకుని అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. మార్కెట్ యార్డ్ వద్ద రోడ్డుకు ఇరువైపులా పోసిన చెత్త కుప్పలకు గుర్తు తెలీని నిప్పు పెట్టడంతో మంటలు ఎగసి పడినట్లు గుర్తించారు. ఎలాంటి ఆస్తి, ప్రాణ నష్టం లేకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. సకాలంలో సంఘటన స్థలానికి చేరుకుని ఎగసిపడుతున్న మంటలను అదుపు చేసినందుకు అగ్నిమాపక శాఖ అధికారి మత్తయ్య, అగ్నిమాపక సిబ్బందికి స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

మంటలు అదుపుచేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

నాటుసారా స్థావరంపై దాడి

ప్రజాశక్తి - చింతలపూడి

నాటు సారా స్థావరాలపై దాడులు నిర్వహించినట్లు చింతలపూడి ఎక్సైజ్ సిఐ పి.అశోక్ తెలిపారు. నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా చింతలపూడి ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో మండలంలోని నాగిరెడ్డిగూడెంలో భుక్య వెంకటేశ్వరరావుకు సంబంధించిన ప్లాస్టిక్ డ్రమ్ముల్లో నిల్వ ఉంచిన 750 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేసి రెండు లీటర్ల నాటు సారాను స్వాధీన చేసుకుని అతని పై పరారీ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. పాత కేసులో ఐదుగురు నిందితులు భూక్యా బుజ్జి, పలగాని రాటాలు, ఇంజుమూడి రాంబాబు, భాస్కర శ్రీ సాయి రంగ ప్రకాష్, మహేశ్వరరావు, బైండోవర్ బాండ్ ఉల్లంఘించినందుకు మండల మెజిస్ట్రేట్ వారు జరిమానా విధించినట్లు తెలిపారు.

ప్రజాశక్తి ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

ఏలూరు ఎంపీ మహేష్‌కుమార్, చింతలపూడి ఎంఎల్ఎ రోషన్‌కుమార్

ప్రజాశక్తి - చింతలపూడి

చింతలపూడి నియోజకవర్గ అభివృద్ధికి కట్టుబడి ఉన్నట్లు ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ యాదవ్ చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ అన్నారు. చింతలపూడి ఏరియా ఆసుపత్రిలో ఏలూరు ఎంపీ మహేష్‌కుమార్, చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ కృషి ద్వారా చింతలపూడి ఏరియా ఆసుపత్రికి గోద్రెజ్ కంపెనీ సమకూర్చిన రూ.పది లక్షల విలువైన పరికరాలను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో అభివృద్ధికి నోచుకోలేదని, కూటమి ప్రభుత్వం మాటల ప్రభుత్వం కాదని చేతలలో చూపిస్తుందన్నారు. ఏలూరు నుంచి చింతలపూడికి చింతలపూడి నుంచి జంగారెడ్డిగూడేనికి మెయిన్ రోడ్డు ప్రారంభించారని, మూడు నెలల్లో పనులు ప్రారంభమవుతాయని తెలిపారు. త్వరలోనే చింతలపూడి వంద పడకల ఆసుపత్రి పూర్తి చేసి ప్రారంభిస్తామని తెలిపారు. రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని కోరారు. అనంతరం చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ మాట్లాడుతూ వంద పడకల హాస్పిటల్ నిర్మాణానికి రూ.22 కోట్ల నాబార్డ్ నిధులు మంజూరయ్యాయని, ఇప్పటివరకు రూ.12 కోట్ల పనులు పూర్తయ్యాయని, పెండింగ్‌లో ఉన్న బిల్లులు కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రూ.మూడు కోట్లు చెల్లింపులు జరిగాయని తెలిపారు. కాంట్రాక్టర్ అగ్రిమెంట్ ప్రకారంగా మరో రూ.నాలుగు కోట్ల పనులు మే మొదటి వారంలో ప్రారంభం కానున్నాయని తెలిపారు. పట్టణ ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం ఆగష్టు 31 నాటికీ ఆసుపత్రి నిర్మాణ పనులు పూర్తి చేస్తామని తెలిపారు. సెప్టెంబర్ మొదటి వారంలో వంద పడకల ఆసుపత్రి ప్రారంభోత్సవానికి సన్నద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్ఎ మురళి, డిసిహెచ్ఎస్ పాల్ సతీష్, ఆసుపత్రి సూపరింటెండెంట్ నారాయణరావు, టిడిపి సీనియర్ నాయకుడు ముత్తారెడ్డి, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ మెంబర్స్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

పరికరాలను ప్రారంభిస్తున్న ఎంపీ, ఎంఎల్ఎ

పిహెచ్‌సిలో వైద్యారోగ్య శాఖ డైరెక్టర్ తనిఖీలు

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

కొయ్యలగూడెం పిహెచ్‌సిని వైద్య ఆరోగ్యశాఖ డైరెక్టర్ డాక్టర్ బి.సుబ్రమణ్యేశ్వరీ బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. రోగులు పొందుతున్న సదుపాయాలను అడిగి తెలుసుకుని రిజిస్టర్లను తనిఖీ చేశారు. ఆసుపత్రిలో ఫార్మసీ గురించి అదే విధంగా ఆపరేషన్ థియేటర్ల గురించి వైద్య శాఖాధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఇటీవల నూతనంగా హాస్పటల్‌కు సమకూరిన పరికరాలను పరిశీలించి సాంకేతిక పరికరాల పనితీరును పర్యవేక్షించారు.

సంపద సృష్టిపై క్లాప్ మిత్రులకు ప్రత్యేక శిక్షణ

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

మండల పరిధిలోని కొత్త రావిచర్ల గ్రామంలో బుధవారం సంపద సృష్టి కోసం క్లాప్ మిత్రులకు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచి కాపా శ్రీనివాసరావు మాట్లాడుతూ జాతిపిత మహాత్మా గాంధీ ఆశయ సాధనలో భాగంగా, సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ల ఆదేశానుసారం స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా గ్రామీణ ప్రాంతాలను పరిశుభ్రం చేయడం, చెత్త నుంచి సంపద సృష్టించి కేంద్రానికి తరలించడం, అక్కడ సంపదను సృష్టించే కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నట్లు చెప్పారు. అందరి సహకారంతో కొత్త రావిచర్ల గ్రామంలో మోడల్ సంపద సృష్టి కేంద్రంగా అభివద్ధి చేసినట్లు చెప్పారు. ఎంపిడిఒ రాఘవేంద్రనాథ్ మాట్లాడుతూ చెత్తను సేకరించే విధానం, సంపద సృష్టి ఎలా జరుగుతుందో తెలిపారు. ప్రతిఒక్కరూ బాధ్యతాయుతంగా పరిసరాల పరిశుభ్రం చేయాలన్నారు. అందుకోసం తమ వంతు సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయని తెలిపారు. డిఎల్‌పిఒ సుందరి మాట్లాడుతూ గ్రామాల పురోభివృద్ధిలో కొత్త రావిచర్ల గ్రామం ఆదర్శవంతంగా నిలుస్తుందన్నారు. అన్ని రకాల కనీస వసతులతో పాటు, స్వచ్ఛ గ్రామంగా తీర్చిదిద్దిన విధానం ఆచరణీయమన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

పోషకాహారంతో రక్తహీనత దూరం

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో బుధవారం పోషణ పక్వడ కార్యక్రమం నిర్వహించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆర్.నరేంద్ర సింగ్ మాట్లాడుతూ గర్భిణులు పౌష్టికాహారం క్రమం తప్పకుండా తీసుకోవాలన్నారు. పండ్లు, పాలు, గుడ్లు, ముఖ్యంగా మునగాకు, ఆకుకూరలు తీసుకోవడంతో రక్తహీనతను జయిస్తారన్నారు. బయట కలుషిత ఆహారాన్ని తీసుకోవడం అనారోగ్యాలకు మార్గం అవుతుందన్నారు. పురుగు మందులు వేయని ప్రకృతి సిద్ధంగా పండించే సేంద్రియ ఆహార పదార్థాలు తీసుకోవడం ఆరోగ్యాన్ని ఎంతగానో అభివృద్ధి చేస్తుందని సోదాహరణంగా వివరించారు. హోమియో వైద్యులు వై.మాధవి, డాక్టర్ హెచ్‌విటి కుమారి ఐసిడిఎస్ సిడిపిఒ ధనలక్ష్మి, వైద్యులు, వైద్య ఆరోగ్య సిబ్బంది, గర్భిణులు పాల్గొన్నారు.

ఏలూరు సిటీ : పౌష్టికాహార పక్షోత్సవంలో భాగంగా ఎంఆర్‌సి కాలనీలో ఉన్న అంగన్వాడీ కేంద్రంలో బుధవారం పిల్లల తల్లులకు సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిడిపిఒ విజయలక్ష్మి హాజరయ్యారు. దీనిలో భాగంగా అంగన్వాడీ పరిధిలో బరువు తక్కువ గల పిల్లల తల్లులకు ఎన్ఆర్‌సి గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్, డిఐఒ నాగేశ్వరరావు, డాక్టర్ మల్లికార్జునరావు, ఎఎన్ఎంలు అంగన్వాడీ కార్యకర్తలు, బాలింతలు, తల్లులు పాల్గొన్నారు.

విద్యార్థులకు యూనిఫాం అందజేత

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

విద్యార్థుల్లో ఆందోళన, భయం, తెలియనితనం పోగొట్టడంతో పాటు హైస్కూల్ స్థాయి వారిలో కలిగే మానసిక, శారీరక మార్పుల గురించి అవగాహన కల్పించడమే రాష్ట్రీయ కిశోర్ స్వస్థ కార్యక్రమ ఉద్దేశమని ఈ కార్యక్రమ నిర్వహణకు పీర్ ఎడ్యుకేటర్స్ పాత్ర ఎంతో ముఖ్యమైందని ఆగిరిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి జాస్తి జగన్మోహనరావు అన్నారు. ఆగిరిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పది మంది బాల, బాలికలను పీర్ ఎడ్యుకేటర్‌గా గుర్తించి వారికి బుధవారం యూనిఫారమ్స్ అందించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు పి.పుష్పలత, ఎంపిహెచ్ఇఒ జి.రత్నబాబు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

కందుకూరి వీరేశలింగం జయంతి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

తెలుగు జాతి గర్వించదగిన మహోన్నత వ్యక్తి, నాటక రచయిత, నవయుగ వైతాళికుడు, సమాజ సేవకుడు, బహుముఖ ప్రజ్ఞాశీలి, కందుకూరి వీరేశలింగం పంతులు 177వ జయంతి సందర్భంగా డిప్యూటీ లైబ్రరీ ఏ నారాయణ రావు కందుకూరి వీరేశలింగం పంతులు చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ లైబ్రేరియన్ వీటి సందీప్ కుమార్, జిల్లా కేంద్ర గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

24న ఏలూరు లేబర్ కార్యాలయం వద్ద ధర్నా

భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రమణారావు

ప్రజాశక్తి - కలిదిండి

భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఈ నెల 24 వ తేదీన ఏలూరు లోని లేబర్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నారపల్లి రమణారావు పిలుపునిచ్చారు. స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో భవన నిర్మాణ కార్మిక సంఘం (సిఐటియు అనుబంధం) మండల కమిటీ సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరిస్తామని ఎన్నికల్లో ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఏ ప్రభుత్వం అధికారంలోకొచ్చినా కార్మికులే నష్టపోతున్నారన్నారు. ఓట్లు వేయించుకుని అధికారంలోకొచ్చిన తర్వాత కార్మికుల సంక్షేమాన్ని విస్మరిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. నిర్మాణ కార్మికుల పెండింగ్ క్లైములు పరిష్కరించాలని సంఘం నాయకులు పరసా రాజేష్, పోతురాజు, బాలాజీ డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మికులందరూ ఏకమై 24న ఏలూరు డిసిఎల్ లేబర్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాలో పాల్గొని జయప్రదం చేయాలని నాయకులు కోరారు. కటికల శ్రీనివాస్, ఎస్.హరీష్, బి.సుందరం, ఎస్.సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

చింతలపూడిలో మెగా జాబ్ మేళా



అభ్యర్థులతో ఎంఎల్ఎ రోషన్‌కుమార్

ప్రజాశక్తి - చింతలపూడి

సిఎం చంద్రబాబు చేపట్టిన పి 4 కార్యక్రమం లక్ష్యాదిశగా ముందుకెళ్తున్నామని చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్ కుమార్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో యాజమాన్యం, ఎంఎల్ఎ ఆధ్వర్యంలో బుధవారం మెగా జాబ్ మేళా ప్రారంభించారు. ఈ జాబ్‌మేళాకు నిరుద్యోగ యువతకు అవకాశం కల్పించడానికి సుమారు 11 కంపెనీల సిఇఒలు హాజరయ్యారు. నిరుద్యోగ యువత సుమారు 400 మందికి పైగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ రోషన్‌కుమార్ మాట్లాడుతూ ఇంతకుముందు తన ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహించి 42 మందికి జాబ్ లెటర్స్ ఇచ్చామని తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ మాట్లాడుతూ నిరుద్యోగ యువత అందరికీ ఇంటర్వ్యూలు నిర్వహించి సుమారు 200 మందికి ఉద్యోగ కల్పనా దిశగా ముందుకెళ్తున్నామన్నారు.

ప్రజల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రాలు దోహదం

ప్రజాశక్తి - టి.నరసాపురం

వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రాలు దోహదపడతాయని తహశీల్దార్ టి.సాయిబాబా తెలిపారు. మండలంలోని బొర్రంపాలెంలో స్వచ్ఛ సేవా ఛారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు పెండ్యాల అభిషేక్ బాబు ఆర్థిక సహకారంతో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని బుధవారం తహశీల్దార్, ఎస్ఐ ఎం.జయబాబు చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వచ్ఛ సేవా ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ ఎం.జయబాబు, డాక్టర్ ఆంజనేయులు, పంచాయతీ కార్యదర్శి నాగేశ్వరరావు, విఆర్ఒ అడపా సుబ్బారావు, సామాజిక కార్యకర్త గుండె పాండురంగ, రాజబోయిన రమేష్, బత్తుల రమేష్, కంభంపాటి జోగేశ్వరరావు, పాలం మోషే, కొనకళ్ల సర్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ముదినేపల్లి : మండలంలోని వడాలి సెంటర్‌లో పంచి రెడ్డి రాజారావు సౌజన్యంతో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని కైకలూరు నియోజకవర్గ టిడిపి కన్వీనర్ వీరమల్లు నరసింహారావు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నరసింహారావు మాట్లాడుతూ వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు దాతలు ముందుకొచ్చి చలివేంద్రాలు ఏర్పాటు చేయడం ముదావహమన్నారు. అనంతరం చలివేంద్రంలో ఆయన ప్రజలకు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నక్కా రంగారావు, నక్కా అప్పారావు, మారగాని శంకర్రావు, బొంతు వెంకటరంగ అప్పారావు, బొంతు మహేష్, మరడాని సత్యనారాయణ, గొర్రెల అర్జునరావు, తరంగబాబు, బొర్రా సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ముదినేపల్లిలో...

విక్టర్ మరిన్ని రికార్డులు సాధించాలి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

మ్యూజిక్ ముద్దుబిడ్డలు పోలగాని విక్టర్ (రాంబాబు)తమ అత్యుత్తమ మ్యూజిక్ ప్రదర్శించి భవిష్యత్తులో మరెన్నో ప్రపంచ రికార్డులు అందుకోవాలని పలువురు సంగీత అభిమానులు కోరారు. గతేడాది డిసెంబర్ ఒకటో తేదీన హలేల్ సంగీత పాఠశాల ద్వారా ప్రపంచ స్థాయిలో జరిగిన గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ మ్యూజిక్ ప్రదర్శనలో తన మ్యూజిక్ ద్వారా ఉత్తమ ప్రతిభ కనబరచి గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం దక్కించుకున్నారు. ఏలూరు ఎన్‌టిఆర్ కాలనీకి చెందిన పాస్టర్ పోలగాని విక్టర్ ఆన్‌లైన్ మ్యూజిక్ ప్రదర్శనలో పాల్గొన్న 1046 మంది విద్యార్థులు గంట సమయంలో కీబోర్డు వాయించి తమ ప్రతిభను కనబరచుకుని బుధవారం గిన్నిస్ వరల్డ్ రికార్డులో స్థానం దక్కించుకున్నారు. ప్రపంచ రికార్డు నెలకొల్పి ఈ బృందంలో వీరి మ్యూజిక్‌ను గుర్తించిన వరల్డ్ రికార్డు ప్రతినిధులు ఆనంద్ రాజన్, హల్లేలు మ్యూజిక్ పాఠశాల వ్యవస్థాపకుడు అగస్టీన్ దండంగిలు వీరిరువురికి సర్టిఫికెట్లతో పాటు గోల్డ్ మెడల్స్ కూడా అందించారు. ఈ ఘనత సాధించిన పాస్టర్ పి.విక్టర్‌ను వారి కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు, తదితరులు అభినందించి భవిష్యత్తులో అత్యుత్తమ మ్యూజిక్‌ను ప్రదర్శించి ఇలాంటి ప్రపంచ రికార్డులు మరిన్ని పొందాలని వారు కోరారు.

సర్టిఫికెట్ అందుకుంటున్న విక్టర్

ఏలూరు-విజయవాడ నాన్‌స్టాప్ బస్సు ప్రారంభం

బస్సు ప్రారంభిస్తున్న రెడ్డి అప్పలనాయుడు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఏలూరు డిపోలో బుధవారం ఏలూరు నుంచి విజయవాడ నాన్ స్టాప్ కొత్త అల్ట్రా డీలక్స్ సర్వీసును ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి, ఆర్‌టిసి విజయవాడ జోనల్-2 ఛైర్మన్ రెడ్డి అప్పలనాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత దాదాపు 12 కొత్త సర్వీసులను, అనేక కొత్త బస్సులను ప్రారంభించినట్లు తెలిపారు. ప్రతినిత్యం తమ వద్దకు వచ్చే అనేకమంది ప్రజల విన్నపాలు మేరకు కొత్త బస్సులు ప్రారంభించినట్లు తెలిపారు. ప్రజలకు సరికొత్త బస్సులు, సరికొత్త రూట్లలో మరిన్ని బస్సులు ఏర్పాటు చేయడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. జోనల్ ఛైర్మన్ రెడ్డి అప్పలనాయుడు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి తాను జోనల్ ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత జోన్ మొత్తం పర్యటిస్తూ నిరంతర అభివృద్ధికి అధికారులతో సమీక్షిస్తూ మరిన్ని కొత్త బస్సులు తీసుకురావడానికి, కొత్త సర్వీసులు ఏర్పాటు చేయడానికి తన వంతు కృషి చేస్తున్నానని తెలిపారు. ఎంఎల్ఎతో కలిసి మరిన్ని సౌకర్యాలు ప్రజలకు అందే విధంగా తన వంతుగా కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ జి.మురళి, స్టేషన్ మేనేజర్ కుమారి, పిఆర్ఒ నరసింహం, కార్మికులు పాల్గొన్నారు.

నూజివీడు నుంచి మ్యాంగో పార్శిల్ సర్వీస్ ప్రారంభం

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

పట్టణంలోని ఎపిఎస్ఆర్‌టిసి బస్టాండ్ నుంచి ఇతర ప్రాంతాలకు మామిడికాయలు, మామిడి పండ్లు ఎగుమతి ప్రారంభమయ్యాయి. ఎపిఎస్ఆర్‌టిసి పార్శిల్, కొరియర్ రవాణా సర్వీస్ మహిళ ప్రతినిధి బుధవారం మాట్లాడుతూ రెండు రోజుల నుంచి మ్యాంగో పార్శిళ్లు వస్తున్నట్లు చెప్పారు. బెంగళూరు, తిరుపతి, నెల్లూరు, హైదరాబాద్ వైపు ప్రస్తుతం పార్శిళ్లు పంపుతున్నామన్నారు. మ్యాంగో 25 కేజీలు రూ.150 ఛార్జ్ చేస్తున్నట్లు చెప్పారు. దూరం, బరువును బట్టి ఛార్జ్ చేయనున్నట్లు తెలిపారు. రాష్ట్రం వెలుపల ఒకరోజులో, ఇతర రాష్ట్రాలకు రెండు రోజులలోపు మామిడికాయల పార్శిల్ పంపించనున్నట్లు తెలిపారు. ఈ నెలాఖరు నుండి మామిడి పార్సెల్ మరింత ముమ్మరంగా కొనసాగుతాయని వివరించారు.

మలేరియా నిర్మూలనపై శిక్షణ

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

కొయ్యలగూడెంలో పిహెచ్‌సిలో మలేరియా వ్యాధి లక్షణాలు, వ్యాప్తి నిర్మూలనపై బుధవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. డిఎంఒ పిఎస్.ప్రసాద్, డిప్యూటీ డిఎంహెచ్ఒ సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వ్యాధి నిరోధకానికి, నిర్మూలనకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చర్యల గురించి డెమో చేస్తూ అవగాహన కల్పించారు. సిహెచ్ఒ శ్రీనివాస్ మలేరియా వ్యాధి ఏజెన్సీ ప్రాంతాల్లోనే ఎక్కువగా విస్తరిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఏజెన్సీ మెట్ట ప్రాంతంలోని 15 పిహెచ్‌సిలకు చెందిన వైద్యులు, కొయ్యలగూడెం, బయ్యనగూడెం బుట్టాయగూడెం, కుక్కునూరు,పోలవరం సబ్ యూనిట్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పూర్వ విద్యార్థుల చేయూత

ప్రజాశక్తి - కుక్కునూరు

కుక్కునూరు మండల కేంద్రంలో ఎస్‌సి సంక్షేమ హాస్టల్‌లో వంట మనిషిగా పనిచేసిన బుయ్యన భద్రం ఇటీవల మృతి చెందారు. అతను వంట మనిషిగా పని చేస్తున్న కాలంలో చదువుకున్న పూర్వ విద్యార్థులు దారా సంజీవరావు, పెంకే రమేష్ నిర్ణయంతో ఒక తాటి మీదకు వచ్చి అప్పటి వార్డెన్ విజయభాస్కర్‌రావు సహకారంతో ఆ కుటుంబానికి రూ.15 వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు బల్లెం వెంకటేశ్వర్లు, మాచర్ల పోతురాజు, బుయ్యని వీరబాబు, రాయి రవి, కోట వెంకటేశ్వర్లు, లకమల్ల రవి, తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాపై రాజకీయ నాయకులతో సమీక్ష

ప్రజాశక్తి - ఉంగుటూరు

ఉంగుటూరు నియోజకవర్గం పొలిటికల్ పార్టీ నేతలతో ఉంగుటూరు తహశీల్దార్, నియోజకవర్గ ఓటు నమోదు సహాయ అధికారి పి.రవికుమార్ బుధవారం సమావేశం నిర్వహించారు. బిజెపి, సిపిఎం, వైసిపి, టిడిపి తదితర రాజకీయ పార్టీ ప్రతినిధులతో ఓటర్ల జాబితాపై సమస్యలపై సమీక్షించారు. ఎన్నికల ఉంగుటూరు మండల డిప్యూటీ తహశీల్దార్ పోతురాజు పాల్గొన్నారు.

7 నుంచి శ్రీవారి తిరు కళ్యాణోత్సవాలు

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

ద్వారకాతిరుమల వెంకటేశ్వరస్వామి వైశాఖమాస తిరు కళ్యాణోత్సవములు వచ్చే నెల మే ఏడో తేదీ నుంచి 14వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వాహణ అధికారి ఎన్‌విఎస్ఎన్‌మూర్తి బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా స్వామివారి కళ్యాణం 11వ తేదీ ఆదివారం రాత్రి ఎనిమిది గంటలకు, రథోత్సవం 12వ తేదీ సోమవారం సాయంత్రం 7.30 గంటలకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఏడో తేదీ నుంచి 14 వరకు నిత్యార్థిత కళ్యాణాలు, అన్ని అర్జిత సేవలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఆర్థిక సాయం కోసం దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలోని అర్హత గల షెడ్యూల్ కులాలకు చెందిన అభ్యర్థులు ఆర్థిక సాయం కోసం దరఖాస్తు చేసుకోవాలని ఎంపిడిఒ నిఖిల్ మధు శరణ్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 21 నుంచి 50 ఏళ్ల మధ్య వయస్సు కలిగిన వారు అర్హులన్నారు. దరఖాస్తులను ఏప్రిల్ 14 నుంచి మే 10 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

ఎస్‌సి కార్పొరేషన్ రుణాల కోసం దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - ముసునూరు

ఎస్‌సి కార్పొరేషన్ రుణాల మంజూరు కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఎంపిడిఒ జి.రాణి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం చేపట్టిన ఎస్‌సి కార్పొరేషన్ మంజూరు కోసం ఆన్‌లైన్‌లో మే నెల పదో తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. ఆధార్ కార్డు, రేషన్ కార్డు, క్యాస్ట్ సర్టిఫికెట్, ఫోన్ నెంబర్‌తో ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకోవాలని తెలిపారు. ఈ రుణాలు ఆయా యూనిట్ల అనుమతులను బట్టి 50 శాతం లభించనున్నట్లు తెలిపారు.

19న సర్దార్ గౌతులచ్చన్న వర్ధంతి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

స్వాతంత్ర సమరయోధుడు, బలహీన వర్గాల నేత సర్దార్ గౌతు లచ్చన్న 20వ వర్ధంతి ఈ నెల 19వ తేదీ శనివారం నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని గౌడ సంఘం నేత, జనసేన పార్టీ ఉమ్మడి కృష్ణా జిల్లా అధికార ప్రతినిధి మరీదు శివరామకృష్ణ పిలుపునిచ్చారు. నూజివీడు బస్టాండ్ వద్ద ఉన్న లచ్చన్న విగ్రహం వద్ద పైకి ఎక్కటానికి మెట్లు, గ్రిల్స్ ఏర్పాటుకు సంబంధించిన పనులను ఆయన మంగళవారం పరిశీలించారు. శుక్రవారం నాటికి పెండింగ్ పనులు పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో చలమాల వెంకటేశ్వరరావు, బెజవాడ రాంబాబు, మల్లెల చెన్నారావు, కొనకళ్ల రాజేష్, కనకళ్ల జగదీష్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.